క్లుప్తంగా

21న ఉచిత కంటి వైద్య శిబిరం

పెదపూడి: పెదపూడిలో ఈ నెల 21న సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సమితి కాకినాడ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ గోవిందరాజుల చౌదరి మంగళవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయం నేతృత్వంలో శిబిరం జరుగుతుందన్నారు. కంప్యూటర్ ద్వారా చత్వార, తలపోటు పరీక్షలు చేసి మందులు ఇస్తారన్నారు. ఈ అవకాశాన్ని పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జగనన్న ఆరోగ్య సురక్ష దేశానికే ఆదర్శం



రాజుపాలెంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

పెదపూడి: గ్రామీణ పేదలకు నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలిచిందని రాజుపాలెం సర్పంచ్ గుత్తుల పుష్పవతి అన్నారు. మంగళవారం రాజుపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో వైద్యులు మోహిని, ప్రత్యూష, శిరీష తదితరులు 140 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శి సుంకర వీరాస్వామి నాయుడు, పార్టీ మండల కన్వీనర్ గుత్తుల రమణ, వీఆర్వో పంపన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ పాలచర్ల బ్రహ్మాజీ మృతి



బ్రహ్మాజీ(ఫైల్)

పెదపూడి: పెదపూడి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పాలచర్ల బ్రహ్మాజీ(71) మంగళవారం మృతి చెందారు. గతంలో కాంగ్రెస్ పార్టీ తరపున సర్పంచ్‌గా పని చేసిన ఆయన ప్రస్తుతం వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడిగా ఉన్నారు. ఆయన మృతిపై వివిధ పార్టీలకు చెందిన నేతలు సంతాపం తెలియజేశారు.

కొనసాగిన ఎన్ఎస్ఎస్ శిబిరం



నాగరత్నం కాలనీలో పనులు చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నాగరత్నం కాలనీలో విద్యార్థులు నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ క్యాంపు మంగళవారం కూడా కొనసాగింది. విద్యార్థులు రోడ్డు లెవెలింగ్ పనులు చేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎం.సుధామయి ఆధ్వర్యంలో ఈ పనులు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటేష్, డాక్టర్ మాదవ్, లైబ్రేరియన్ శివప్రసాద్, ఫణీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు

ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠాపన పూజలు

రంగంపేట: మండలంలోని సుభద్రంపేటలో ఉన్న శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద అర్చకులు మైలవరపు శేషగిరిరావు ఆధ్వర్యంలో ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠాపన సందర్భంగా మంగళవారం ఆలయంలో గణపతి పూజ, గోపూజ, యాగశాల ప్రదక్షిణ నిర్వహించారు. బుధవారం ఆలయం వద్ద ధ్వజస్తంభ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. పూజల్లో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, సర్పంచ్ కూడి సాయి తాతారావు, దేవస్థాన చైర్మన్ చక్కపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు కోదండరాముని విగ్రహ ప్రతిష్ఠ

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం వెలంపేట వద్ద నూతనంగా నిర్మించిన ఆలయంలో బుధవారం మిక్కలి దుర్గయ్యశాస్త్రి, మహంకాళి వెంకటరమాశాస్త్రిల ఆధ్వర్యంలో కోదండరాముని విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లుగా ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా హోమాలు, వేదపారాయణ, గణపతి పూజ, సూర్య నమస్కారాలు నిర్వహిస్తారన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకోవాలని కోరారు.

బెల్లం ఊట ధ్వంసం

సీతానగరం: మండలంలోని మిర్తిపాడు-కూనవరం రోడ్డులో సారా తయారీ బట్టీపై దాడి చేసి మూడు వేల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు ఎస్సై టి రామకృష్ణ మంగళవారం తెలిపారు. సిబ్బందితో సారా బట్టీపై దాడి చేసి బెల్లం ఊటతో పాటుగా 110 లీటర్లు సారా, సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

రహదారులకు మహర్దశ

- నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధి పనులు
- రూ.185 కోట్లతో మరమ్మతులు



నాలుగు లేన్లుగా అభివృద్ధి చేస్తున్న రాజానగరం - కలవచర్ల రోడ్డు



రాజానగరం - ముక్కినాడ రోడ్డులో జరుగుతున్న అభివృద్ధి పనులు

రాజానగరం: నాణ్యతతో కూడిన పనులు చేస్తే అవి పది కాలాల పాటు నిలిచి ఉంటాయి. అయితే గత పాలకులు రోడ్లు వేసే సమయంలో నాణ్యతను పట్టించుకోకపోవడంతో ఆ రోడ్లు ఏడాది తిరక్కుండానే పాడైపోయి గోతులు దర్శనమిచ్చాయి. ఇదే సమయంలో భారీగా వర్షాలు కూడా కురవడంతో మూలిగే నక్క పై తాటికాయ పడినట్టుగా ఆ రోడ్ల ప్రయాణం ప్రయాణికులకు చుక్కలు చూపించేలా తయారయ్యాయి. వీటన్నింటినీ గమనిస్తూ వచ్చిన రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సమస్యల తీవ్రతను సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ రోడ్లకు సత్వరమే కొన్నిచోట్ల మరమ్మతులు చేపట్టాల్సిన అవసరాన్ని, మరి కొన్ని చోట్ల అభివృద్ధి (విస్తరణ) చేయాల్సిన ప్రజాభీష్టాన్ని ఆయనకు వివరించారు. దీంతో వివిధ దఫాలుగా నియోజకవర్గంలో పలు రోడ్లకు ఇప్పటికే రూ.165 కోట్లు నిధులు మంజూరు కాగా, ఇటీవలే మరో రూ.19.44 కోట్లు మంజూరయ్యాయి. వీటితో చేపట్టిన రోడ్ల అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వీటితో నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి ఇంతవరకు కేటాయించిన నిధులు సుమారు రూ.185 కోట్లకు చేరుకున్నాయి.

రూ. 19.44 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి

ఇటీవల మంజూరైన రూ. 19.44 కోట్లలో రాజానగరం-ముక్కినాడ, పుణ్యక్షేత్రం-జి.యర్రంపాలెం రోడ్డుకు రూ. 4.30 కోట్లు, కోరుకొండ - నాగంపల్లి రోడ్డుకు రూ. 2.04 కోట్లు కేటాయించారు. సీతారామపురం - కనుపూరు, గాదరాడ (వయా) సీటీఆర్ఐ - నందరాడ రోడ్డుకు రూ. 2 కోట్లు, కోరుకొండ - మల్లిసాల రోడ్డుకు రూ. 2 కోట్లు, పల్లకడియం - రాధేయపాలెం రోడ్డుకు రూ. 2 కోట్లతో పనులు చేపట్టారు. దివాన్‌చెరువు – శ్రీరామపురం రోడ్డుకు రూ. 1.50 కోట్లు, బుచ్చింపేట – గాదరాడ (వయా) జంబూపట్నం రోడ్డుకు రూ. 1.30 కోట్లు, భూపాలపట్నం రోడ్డుకు రూ. 1.30 కోట్లు, దివాన్‌చెరువు - నరేంద్రపురం రోడ్డుకు రూ. ఒక కోటి, రాజానగరం పాత ఎన్‌హెచ్ రోడ్డుకు రూ. 70 లక్షలు, పాతతుంగపాడు – జి.యర్రంపాలెం రోడ్డుకు రూ. 70 లక్షలు, పల్లకడియం - వడిశలేరు రోడ్డుకు రూ. 60 లక్షలు కేటాయించారు. వీటికి సంబంధించిన పనులు దాదాపు పూర్తి కాగా సీతానగరం, ముగ్గళ్ల, చినకొండేపూడి, నాగంపల్లి, సీతారామపురం, కలవచర్లలలో చేపట్టిన రోడ్ల పనులు త్వరితగతిన జరుగుతున్నాయి.

రోడ్ల అభివృద్ధికి నాన్నే మార్గదర్శి



పూర్వపు కడియం నియోజకవర్గంలోని రాజానగరం మండలంలో గతంలో నాన్న జక్కంపూడి రామ్మోహనరావు ఆర్అండ్‌బి శాఖ మంత్రిగా ఉన్న సమయంలో వేసిన రోడ్లు 10 సంవత్సరాలు పై బడి పటిష్టంగా ఉన్నాయి. ఆ తరువాత వచ్చిన వారు వేసిన రోడ్లు, చే సిన మరమ్మతులు ఏడాది కూడా నిలబడలేదు. భారీగా కురిసిన వర్షాలకు పూర్తిగా పాడైపోయాయి. ఒక రకంగా చెప్పాలంటే నాణ్యత పాటించక చేసిన పనులు వర్షాలకు కొట్టుకుపోయాయి. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి, ఆయన సహకారంతో నాన్న చూపిన బాటలోనే పటిష్టమైన రోడ్ల నిర్మాణానికి కృషి చేశాను. మనం చేసిన అభివృద్ధి పనులు పది కాలాల పాటు ప్రజలు మెచ్చుకునేలా ఉండాలనేదే నాన్న ఆశయం, అదే నాకు మార్గదర్శకం.

– జక్కంపూడి రాజా, ఎమ్మెల్యే, రాజానగరం.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

బిక్కవోలు: రాజకీయ పార్టీల నాయకులు తప్పనిసరిగా ఎన్నికల నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ పి.బుజ్జిబాబు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రాజకీయ నాయకులు మీటింగ్‌లు పెట్టుకునేందుకు, మైక్‌లకు పోలీసుల అనుమతి తీసుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రచారంలో ఉపయోగించే వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఆర్వో అనుమతితో పాటు పోలీసులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎవరైనా ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు ప్రయత్నించినా, బెదిరించినా వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఘనంగా పునీత జోజప్ప పండగ

మధురపూడి: యేసుక్రీస్తు తండ్రి పునీత జోజప్ప మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బూరుగుపూడి ఆర్‌సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రెవరెండ్ ఫాదర్స్ సొరిబాబు, మనోజ్‌కుమార్ వాక్య సందేశమిచ్చారు. సోమవారం ప్రారంభమైన కూటలు బుధవారంతో ముగియున్నాయి. ఈ కూటాల్లో పాస్టర్ రాయి థోమాస్, సంఘపెద్దలు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ర్యాలీలొద్దు

రంగంపేట: రాజకీయ పార్టీల నాయకులు అనుమతి లేకుండా ర్యాలీలు నిర్వహించకూడదని ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మీటింగ్‌లు పెట్టుకునేందుకు, మైక్‌లకు పోలీసుల అనుమతి తీసుకోవాలని సూచించారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- పాత వీరంపాలెంలో వైఎస్సార్ సీపీలో చేరికలు



పాత వీరంపాలెంలో వైఎస్సార్ సీపీలో చేరిన వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని, అవి కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని పాత వీరంపాలెం గ్రామంలో తోటకూర స్వామి ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన మాడెం శ్రీనివాస్, ఎల్ల దుర్గాప్రసాద్, ఎలుగుబంటి వీర వెంకట సత్యనారాయణ, ఎలుగుబంటి వెంకన్న, ముత్తాబత్తుల రమేష్, ముత్తాబత్తుల కల్యాణ్, వల్లభొట్టి సత్యనారాయణ, కె.సతీష్ తదితరులతో పాటు మరో ఐదు కుటుంబాలకు చెందిన పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టి అర్హులందరికీ అందించారన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇటువంటివి ఒక్క పథకమైనా లేదని ఎద్దేవా చేశారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో టీడీపీ నాయకులు ఇప్పుడు ఏవేవో హామీలు ఇస్తున్నారని, వారికి అధికారమిస్తే ఏవేవో కుంటి సాకులు చెప్పి హామీలు అమలు చేయకుండా పబ్బం గడుపుతారన్నారు. కావున ప్రజలందరూ విజ్ఞతతో ఆలోచించి మళ్లీ వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. పార్టీలో చేరిన పలువురు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి చేస్తున్న అభివృద్ధి నచ్చి వైఎస్సార్ సీపీలో చేరామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ గండి వెంకటేశ్వరరావు, సర్పంచ్ ఏసులంక గంగాభవానీ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే ప్రభుత్వ పథకాలు

ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి



మెళ్లూరులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి

బిక్కవోలు: కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఇంటి ముంగిటకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరవేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి దక్కుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి అన్నారు. మంగళవారం ఆమె మండలంలోని మెళ్లూరు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని గడప గడపలో ఆమెకు అపూర్వ స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతో నిరుపేదల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయన్నారు. జగనన్న పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో మంచి జరిగితేనే ఓటేయండని అడిగిన దమ్మున్న నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రానున్న ఎన్నికల్లో అనపర్తి ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలోని జిల్లా మహిళ సంక్షేమ సంఘం చైర్‌పర్సన్ రొంగల పద్మావతి, సర్పంచ్ పి.సత్యసాయిరాం, ఉప సర్పంచ్ కొమ్మన ఆనంద్, ఎంపీటీసీ సభ్యుడు కె.చక్రధరరావు, పి.శ్రీనివాసరావు, వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జక్కంపూడి రాజశ్రీ పరామర్శ



వీరన్నను పరామర్శిస్తున్న జక్కంపూడి రాజశ్రీ

మధురపూడి: రాజమహేంద్రవరంలోని ప్రైవేటు హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ కార్యకర్త కొటారి వీరన్నను మంగళవారం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి రాజశ్రీ పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు తెలుసుకొని ఓదార్చారు. ఆమె వెంట బూరుగుపూడి మాజీ సర్పంచ్ కంటే సత్తిబాబు తదితరులు ఉన్నారు.

రాజకీయ ప్రకటనలు నిషేధం

- ప్రభుత్వ ఆస్తులు, సంస్థలపై ఎన్నికల ప్రచారం చేయకూడదు
- జెండాలు, పోస్టర్ల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి
- కలెక్టర్, డీఈఓ మాధవీలత



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత తదితరులు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): మోడల్ ప్రవర్తనా నియమావళిలో ప్రభుత్వ రవాణా, పోస్టాఫీసులు, ప్రభుత్వ ఆసుపత్రులు, డిస్పెన్సరీల స్థలాల్లో ఏదైనా రాజకీయ ప్రకటన ఉంటే, వెంటనే వాటిని తీసేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత అన్నారు. మంగళవారం సాయంత్రం వెలగపూడి నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులతో ప్రకటనలు, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు, ఈవీఎం రాండమైజేషన్, ప్రతికూల వార్తలు, పీవో, ఏపీఓ శిక్షణ తదితర అంశాలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల ప్రక్రియలో భాగస్వామ్యం చేస్తున్న ప్రిసైడింగ్ అధికారి, సహాయ ప్రిసైడింగ్ అధికారి, ఇతర పోలింగ్ సిబ్బందికి ముందస్తుగా శిక్షణ ఇచ్చేందుకు కార్యచరణ రూపొందించామన్నారు. రిటర్నింగ్ అధికారులతో సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశామన్నారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్‌లు, విమానాశ్రయం, వంతెనలు, రెల్వే, రోడ్‌వేలు, ప్రభుత్వ స్థలాన్ని ఉపయోగించడం, బస్సులు, ప్రభుత్వ భవనాలు, విద్యుత్, టెలిఫోన్ స్తంభాలు, మున్సిపల్, స్థానిక సంస్థల భవనాలపై రాజకీయ ప్రకటనల ఉండకూడదన్నారు. వ్యాపార సముదాయాలు వద్ద కేవలం ఆయా వ్యాపార ప్రకటనలు తప్ప రాజకీయ ప్రచారం కోసం వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్లు, ఆటోలు, ఇతర వాహనాలపై ఎటువంటి రాజకీయ పార్టీల ఫొటోలు, స్లోగన్లు ఉండకూడదన్నారు. లేకుంటే రవాణా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రాజమహేంద్రవరం రూరల్ ఆర్వో జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్, అర్బన్ ఆర్వో మున్సిపల్ కమిషనర్ కె.దినేష్‌కుమార్, కొవ్వూరు ఆర్వో సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్, సహాయ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్, డీఆర్వో జి.నరసింహులు, రాజానగరం ఆర్వో, ఆర్డీఓ ఎ.చైత్ర వర్షిణి నియోజకవర్గాల ఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లను చైతన్యపరుస్తూ పోలీసు కవాతు

రాజానగరం: భారత రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ వినియోగించాలని, స్వార్థ చింతనతో ఓటు హక్కును దుర్వినియోగం చేయరాదంటూ ఓటర్లను చైతన్య పరుస్తూ రాజానగరంలో పోలీసులు మంగళవారం సాయంత్రం కవాతు నిర్వహించారు. సీఐ కాశీవిశ్వనాథ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కవాతులో ఎస్సైలు పవన్‌కుమార్, మనోహర్, 17 మంది స్థానిక పోలీసులతోపాటు వంద మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షకు 13 మంది గైర్హాజరు

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం, పందలపాక 1, 2, బిక్కవోలు, ఇలపల్లిల్లో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రాల్లో మంగళవారం జరిగిన పదో తరగతి హిందీ పరీక్షకు 13 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈఓ-1 సీహెచ్ సత్యనారాయణ తెలిపారు. మొత్తంగా 592 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 579 మంది మాత్రమే హాజరయ్యారన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలి



ఆరికరేవులలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

బిక్కవోలు: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అందరూ సహకరించాలని ఈస్ట్ జోన్ డీఎస్పీ ఎం.కిషోర్‌కుమార్ ప్రజలను కోరారు. మండలంలోని ఆరికరేవుల, మెళ్లూరు, కొంకుదురు, ఊలపల్లి గ్రామాల్లో ఆయన ఆధ్వర్యంలో 78 మంది సీఆర్‌పీఎఫ్ పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ కిషోర్‌కుమార్ మాట్లాడుతూ సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు, కటౌట్లు, పార్టీ జెండాలు కనిపిస్తే సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ట్రైనింగ్ డీఎస్పీ భానుదయ, అనపర్తి సీఐ శివగణేష్, ఎస్‌ఐ బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంసా పత్రాలు



ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాజానగరం: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని వెలుగుబంద, ప్రాథమికోన్నత పాఠశాలలో ఫిబ్రవరి 28న నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులకు 'క్రియ' సంస్థ ప్రశంసాపత్రాలను బహూకరించిందని ఎంఈఓలు రామన్నదొర, జ్యోతిప్రసాద్ తెలిపారు. ఆ ప్రశంసా పత్రాలను మంగళవారం ఆయా విద్యార్థులకు అందజేశారు. హెచ్‌ఎం అగ్నేశ్వరరావు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగన్‌తోనే అభివృద్ధి సాధ్యం

మధురపూడి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే పేదల అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని వైఎస్సార్ సీపీ నాయకులు రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అడ్వైజర్ మేడా గురుదత్త ప్రసాద్ అన్నారు. మంగళవారం కోరుకొండ మండలం కోటి, కేటికేశవరం, రాఘవపురం గ్రామాల్లో పర్యటించి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, ఫ్యాన్ గుర్తుకే ఓట వేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మండపాక శ్రీను,తదితరులు పాల్గొన్నారు.

పోటీ చేసే అభ్యర్థులు అనుమతికి దరఖాస్తు చేసుకోవాలి

రాజమహేంద్రవరం రూరల్: ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు, రాజకీయా పార్టీలు విధిగా సువిధా పోర్టల్ ద్వారా ముందస్తు అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలని రాజమండ్రి రూరల్ అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలక్టరు ఎన్.తేజ్ భరత్ అన్నారు. మంగళవారం రాత్రి జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో రాజకీయ ప్రతినిధులతో జరగబోవు ఎన్నికలపై సూచనలు తెలుపుతూ సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలని సజావుగా నిర్వహించే క్రమంలో రాజకీయ పార్టీలు ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు కచ్చితంగా పాటించాలన్నారు. ప్రచారాలకు ముందస్తు అనుమతులు అవసరమన్నారు. ఈ సమావేశంలో పలు రాజకీయ పార్టీలు ప్రతినిధులు, తహసీల్దార్ అప్పారావు పాల్గొన్నారు.

యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ సమావేశం

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరం బైబిల్ మిషన్ ప్రార్థనామందిరంలో మంగళవారం యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం అధ్యక్షుడు చిర్రా ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. బైబిల్ మిషన్ స్వస్థతశాల ప్రెసిడెంట్ రెవరెండ్ డాక్టర్ జి.ఇమ్మానుయేలు ఆధ్యాత్మిక సందేశాన్నిచ్చారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ ఎస్.ఆనందకుమార్, ముఖ్యసలహాదారులు వరిగేటి ప్రసన్నకుమార్, సంస్థ నాయకులు ఎలియాజరు, పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల గ్రీవెన్స్‌కు ఐదు అర్జీలు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం పరిధిలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మంగళవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు ఐదు అర్జీలు వచ్చినట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఉద్యోగుల గ్రీవెన్స్ నిర్వహించామన్నారు. అర్జీలను జిల్లాలో నమోదు చేసి ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు పంపించామన్నారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ పి.శ్రీనివాస్, డిప్యూటీ డీఈఎంఓ డాక్టర్ సత్యకుమార్ నల్లూరి, సూపరింటిండెంట్ కేవీవీ సత్యనారాయణ, ఇతర వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఖైదీల కుటుంబ సభ్యులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి ప్రత్యూషకుమారి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉన్న ఖైదీల కుటుంబ సభ్యులతో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ న్యాయవాది, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రత్యూషకుమారి ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆస్తి వివాదాలు, కుటుంబ సభ్యుల మధ్య సమస్యలు, ఇతర న్యాయ సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి వాటిని పరిష్కరించుకోవాలన్నారు. అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి అందక పోయినా ఈ సంస్థ సహకారంతో సమస్యలు పరిష్కరించుకోగలరన్నారు. ఆర్థిక సమస్యల కారణంగా పిల్లల విద్యాభ్యాసం ఆగిపోవడం, సమాజంలో ఖైదీల కుటుంబ సభ్యుల పట్ల వారి పిల్లల పట్ల వివక్ష చూపడం వంటి ఇబ్బందులు ఎవరికైనా ఎదురైతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఖైదీలకు అందిస్తున్న ఉచిత న్యాయ సేవలపై వారికి అవగాహన కల్పించారు. అనంతరం ఓఎన్‌జీసీ గోదావరి గోల్ఫ్ క్లబ్‌లో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ప్రత్యూషకుమారి మాట్లాడుతూ మహిళలపై జరు అన్యాయాలను ధైర్యంగా ఎదుర్కొని వారి హక్కులను పరిరక్షించుకోగల సామర్థ్యం పెంచుకోవాలన్నారు. ఇబ్బందులకు భయపడి తొందరపాటు నిర్ణయాలు తీసుకోరాదన్నారు.